వకుళాభరణం - రూపకం

మేదిని జీవులగావ - మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష - నిద్ర మేలుకోవయ్యా

తగు గోపికల కన్ను - దామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుడ - మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే - తిమిరము విరియగా
నెగడిన పరంజ్యోతి - నిద్ర మేలుకోవయ్యా

ఘనదురితపు నల్ల - గలువలు వికసించె
మినుకు శశివర్ణుడ - మేలుకోవయ్యా
పనివడి వేదాలనే - పక్షులెల్లా బలుకగ
జనక యాశ్రిత పారి - జాత మేలుకోవయ్యా

వరలక్ష్మీ కుచచక్ర - వాకము లొండొంటిరాయ
మెరయు దోషరహిత - మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్య - భోగములు భోగించ
నిరతి శ్రీవేంకటేశ - నేడు మేలుకోవయ్యా

జీవులందరికీ రక్షకుడు శ్రీ మహావిష్ణువు ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. ఆస్వామికి ని్ర దమేల్కొలుపు సంకీర్తనలో ఆధ్యాత్మ శృంగారాల కలగలుపు.

మేలుకోవయ్యా; నీ దయ మాత్రమే మాకు రక్ష -

'వనమాలీగదీశాంర్గీ శంఖీ చక్రీ చ నందకీ

శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవోభిరక్షతు' అని విష్ణు సహస్రనామ స్తోత్రంలో సం పుటి. జీవులందరినీ రక్షించవలె మేలుకో.

గోపికల నయన పద్మాలు మిక్కిలి వికసించాయి. సూర్యనేత్రుడవు నీవు మేలుకోవయ్యా! రాక్షసులనే చీకటిచే పలాయనం చిత్తగింపజేసే పరంజ్యోతికి నీవు మేలు కోవయ్యా!

పనిగొన్న వేదాలనే పక్షులు పలుకగా, ఘనమూ, దురితమూ అనే వేదగాన తాళవేగ విశేషములు నల్లకలువలై (అలమేల్మంగ కన్నుగలువలై వికసించినవి అని ఊహ్యం. మరొక అర్థం చెప్ప వీలుకాదు.) వికసించినవి - ఘనం - జట - పనస - ఇవి వేద పాఠప్రయోగ విశేషాలు. అతివిలంబితం - విలంబితం, మధ్యమం - దురితం, అతి దురితం - ఇవి గానకళలో తాళానికి సంబంధించిన గతిభేదవిశేషాలు. మినుకు శశివర్ణుడు - అన్నప్పుడు సహస్రారకమలంపైనున్న అమృతబిందునిష్యందియైన చంద్రుడని సూచన - జగజ్జనకా ! యాశ్రితులపాలి కల్పవృక్షమా; మేలుకోవయ్యా.

శ్రీ వరలక్ష్మి కుచములు చక్రవాకములై ఒండొంటితో రాచుకొంటున్నవి. పరస్పరం మీరుభయులూ సములుగనుక అసమతాది దోషాలేవీ లేవు. (సాముద్రిక శాస్త్రప్రకారం) నేనొనరించే నిత్య భోగ నిత్యపూజలు నిరతిశయ విధిగా స్వీకరించ సమయమైనది. మేలుకోవయ్యా అని నిత్యజాగృతుడైన నిత్యునికి అనునిత్యజాగృతీ నిత్యసంకీర్తనను ఘనజట పనసల - దురితకాలపు దువాళులతో వెలయించారు అన్నమాచార్యులు.